నగరాభివృద్ధికే రహదారుల విస్తరణ

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- తాజ్ బాబా మసీదుకు రూ.9.12 లక్షల నష్టపరిహారం అందజేత


తాజ్ బాబా మసీదు పెద్దలకు నష్టపరిహారం చెక్కులు అందజేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు రహదారులను విస్తరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తెలిపారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా కొంతమేర నిర్మాణాలను కోల్పోయిన తాజ్ బాబా మసీదుకు నష్టపరిహారం అందజేశారు. కోల్పోయిన నిర్మాణాల ఆస్తుల విలువను బట్టి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.9.12 లక్షల నష్టపరిహారాన్ని చెక్కు రూపంలో ఆదివారం కె.కె.రాజు చేతుల మీదుగా మసీదు పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా విశాఖలో గత నాలుగైదు ఏళ్ల నుంచి జనాభా పెరుగుతోందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాల నిమిత్తం మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లను విస్తరించవలసిన అవసరం ఏర్పడిందని చెప్పారు. రహదారుల విస్తరణతోనే నగరాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డును విస్తరిస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణలో తాజ్ బాబా మసీదుకు సంబంధించిన కొన్ని ఆస్తులకు నష్టం వాటిల్లడంతో నిర్మాణ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో కోల్పోయిన స్థలానికి కూడా త్వరలో టీడీఆర్ మంజూరు చేస్తామని, దానితో మసీదును అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించిన దర్గా పెద్దలకు కె.కె.రాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ 26వ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు బర్కత్ ఆలీ, ఆళ్ల లీలావతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ రమేష్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, గొడవల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడు ఉంటుందని గుర్తుంచుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ రమేష్ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీను, ధర్మేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.
- ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని హితవు పలికారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని, మంచిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద పోలీసులు అప్పగించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న నిపుణులు

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 194 మందికి బీపీ, సుగర్ పరీక్షలు, 136 మందికి ఈసీజీలు, 108 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎముకలు, కీళ్ల వ్యాధి నిపుణుడు డాక్టర్ ఎం.రామరాజు మాట్లాడుతూ వృద్ధులు ఎముకల సాంద్రత పరీక్షలు చేయించుకుని వైద్యుని సలహాల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. డాక్టర్ రేవతి మాట్లాడుతూ ఆహారంలో పిండి పదార్థాలు తగ్గించి ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే వాటిని తీసుకోవాలని సూచించారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ యలమంచిలి శ్రీవాణి కంటికి సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను వివరించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులను సత్కరించారు. క్లబ్ పూర్వాధ్యక్షుడు సత్తి సునీల్‌రెడ్డి సమర్పించిన సరియైన ఉచ్చారణ, అడవితల్లి ఒడి అనే పుస్తకాలను వైద్యులకు అందించారు. డిస్ట్రిక్ట్–101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వాధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎ.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు వడ్డాది అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు, టి.వెంకటరమణ, ఎస్.రామ్మోహనరావు, కోన ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

30న దుకాణాలు, మార్కెట్లకు వేలం

కంచరపాలెం: జోన్-5 పరిధిలోని పలు వార్డుల్లో ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 30న జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సంజీవయ్య కాలనీ, అశోక్‌నగర్, గుల్లలపాలెంలోని దుకాణాలకు, కంచరపాలెం నేతాజీ వంతెన నుంచి మర్రిపాలెం వరకు, అక్కయ్యపాలెంలో రోడ్డు పక్కన మార్కెట్లు, జనతా కాలనీలో కారం మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్ పక్కన మార్కెట్లకు, మాధవధారలోని మాధవ స్వామి కల్యాణ మండపానికి వేలం జరుగుతుందని చెప్పారు. వేలంపాటలో పాల్గొనే ఔత్సాహికులు మంగళవారం ఉదయం పేర్లు నమోదు చేసుకోవాలని జెడ్సీ కోరారు.

బీసీ ప్రజా సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లేష్


రవికుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న మల్లేష్

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రజా సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బి.మల్లేష్ నియమితుడయ్యారు. అక్కయ్యపాలెంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సంఘ అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్ చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. నూతనంగా ఎన్నికైన బి.మల్లేష్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి, బీసీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జాతీయ మహిళా కార్యదర్శి సత్యవేణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యనాథానికి సత్కారం


రాళ్లపల్లి సత్యనాథాన్ని సత్కరిస్తున్న విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, సీనియర్ సభ్యుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథంను ఆదివారం వాకర్స్ పార్కులో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత పి.విష్ణుకుమార్‌రాజు ప్రత్యేకంగా కలిశారు. సత్యనాథం 90వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనను సత్కరించి, ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో వైశాఖీ స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, బీజేపీ నాయకుడు ఒమ్మి నారాయణరావు, 50వ వార్డు అధ్యక్షుడు కె.వెంకటరావు, శశిభూషణరావు పాల్గొన్నారు.

వేటూరి గీతాలతో సంగీత విభావరి రేపు

సీతంపేట: సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వేటూరి రచించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు కళా పీఠం కార్యదర్శి గంటి మురళి తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని గాలిదేవర సాహితిని వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. సినీ గాయని సాహితి, రమేష్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేష్, హారిక, పట్నాయక్, లిపికారెడ్డి తదితరులు వేటూరి గీతాలను ఆలపిస్తారన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక


ఎస్ఈ రైల్వే ఎయిడెడ్ హైస్కూల్ 1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సందడి

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఎస్ఈ రైల్వే ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. అదే పాఠశాల ఈ వేడుకకు వేదికైంది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఉన్నత హోదాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఆప్యాయంగా ఒకరిని ఒకరు పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చాలా ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో నాటి విద్యార్థులను, తోటి ఉపాధ్యాయులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులంతా శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆటపాటలతో సందడిగా గడిపారు.

బీజేపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జిగా పరశురాంరాజు



సీతమ్మధార: బీజేపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జిగా తనను పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియమించినట్లు ఎం.ఎం.ఎస్.పరశురాంరాజు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని తన నివాసంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్‌చార్జిగా తాను పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అరకు పార్లమెంట్ ఇన్‌చార్జిగా తనను నియమించారన్నారు.

సామాజిక సేవ.. యువత బాధ్యత


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రొంగలి జగన్నాథం

మురళీనగర్: యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడానికి ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రొంగలి జగన్నాథం పిలుపునిచ్చారు. మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో పార్కు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. భారతీయత గొప్పదనాన్ని, దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ముందుగా ఆయన వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ శిబిరంలో యువకులు, స్థానికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పృథ్వీ, జీవీ రత్నం, భాస్కర్, మోహన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

150 మందికి సేవారత్న పురస్కారాల ప్రదానం


పురస్కారాలు అందుకున్న వారితో శివశంకర్, గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: అక్కయ్యపాలెం రైతుబజార్ వద్ద ఒక ఫంక్షన్ హాల్ ఆదివారం వివిధ రాష్ట్రాల్లో రక్తదానంతోపాటు వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న 150 మంది సేవకులకు భారత సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా ఎంతో మందికి రక్తం అందించి తాసుబెల్లి ఫౌండేషన్ ప్రాణదాతగా నిలిచిందని కొనియాడారు. సంస్థ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఎంతోమంది 50 సార్లకు పైగా రక్తదానం చేసిన వారున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, సంస్థ చైర్మన్ శంకర్ నాయుడు, ట్రస్టీలు ఎర్రంశెట్టి సురేష్, ఎస్.వెంకటలక్ష్మి, అఖిల్ నాయుడు, నవీన్, కరణం కళావతి, వర్మ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి


మాస్టర్ అథ్లెట్స్‌కు ట్రాక్ సూట్‌లు అందిస్తున్న సనపల వరప్రసాద్

మురళీనగర్: విశాఖ మాస్టర్స్ అథ్లెట్‌లు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించాలని మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆకాంక్షించారు. ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ కార్యదర్శి మంగ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లను వరప్రసాద్ అందించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ విజన్ డెవలపర్స్ అధినేత ఎం.శ్రీరామమూర్తి 50 మందికి క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరభద్రరావు, ఎం.శ్రీనివాస్ రాజు, పోలీస్ శాఖ నుంచి క్రీడాకారులు జె.ఉష, బాలరాజు, అనురాధ, డాక్టర్ భాగ్యలక్ష్మి, సరోజిని, బాలరాజు, వనిత వాకర్స్ క్లబ్ కార్యదర్శి జయ, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస రాజు, యూనివర్సల్ యూత్ అధ్యక్షుడు వంశీ, శశికుమార్, రాజ్యలక్ష్మి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పనిచేయని బోరు


కప్పరాడలో నిరుపయోగంగా బోరు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డులోని కంచరపాలెం పరిధి 270 సచివాలయం కప్పరాడ కొండవాలు ప్రాంతంలో తాగునీటి బోరు పనిచేయడం లేదు. తమకు ఎంతగానో ఉపయోగపడే బోరు నెల రోజుల నుంచి వినియోగంలో లేదని స్థానికులు చెబుతున్నారు. బోరుపై గల పాత వార్డు నంబర్‌ను నేటికీ మార్చలేదని తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి బోరుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ముగిసిన ఉజ్జీవ సభలు



దైవ సందేశమిస్తున్న అగస్టీన్ జెబకుమార్, ఉజ్జీవ సభలకు హాజరైన క్రైస్తవులు

తాటిచెట్లపాలెం: గురజాడ కళాక్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న వైజాగ్ రివైవల్ మీటింగ్స్(వైజాగ్ ఉజ్జీవ సభలు) ఆదివారంతో ముగిశాయి. 26న యవ్వనస్తుల సదస్సు, 27న విశాఖలోని పాస్టర్స్, క్రైస్తవ నాయకులకు ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. ఈ సభల్లో గాస్పల్ ఇకోయింగ్ మిషనరీ సొసైటీ(జెమ్స్) బిహార్, జనరల్ సెక్రటరీ సహోదరుడు డి.అగస్టీన్ జెబకుమార్ దైవ సందేశాన్ని అందించారు. దేవుడికి ప్రతి ఒక్కరిపై ప్రత్యేక ప్రణాళిక ఉందని, మానవుల పాపాలను క్షమించేవాడు ఏసుక్రీస్తేనన్నారు. దేశంలోని పరిస్థితులు, నాయకుల కోసం ప్రార్థన చేయాల్సిన అవసరం అందరిపైన ఉందని చెప్పారు. విశాఖలోని క్రైస్తవులు ఉత్తర భారతదేశం కోసం ప్రత్యేకంగా ప్రార్థన చేయాలని జెబకుమార్ కోరారు. ఉజ్జీవ సభల్లో విశాఖలోని వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

24వ వార్డు నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు

సీతమ్మధార: భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల శంఖారావం 'సిద్ధం' కార్యక్రమానికి తరలివెళ్లిన 24వ వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆదివారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సత్యం జంక్షన్ నుంచి భారీగా వాహనాల్లో బయలుదేరి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె అభినందనలు తెలియజేశారు.

అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పును అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న భారత నాస్తిక సమాజం ప్రతినిధులు

సీతమ్మధార : ఇజ్రాయిల్–పాలస్తీనా అంతర్జాతీయ న్యాయస్థాన తీర్పును పాటించాలని భారత నాస్తిక సమాజం ప్రతినిధులు కోరారు. ఆదివారం భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఇజ్రాయెల్ పాటించాలని, మూడు నెలలుగా జరుపుతున్న మారణహోమం ఆపాలన్నారు. బడి పిల్లలపై, ఆస్పత్రుల మీద, బజార్లలోని జనసమూహాలపై దాడులు చేయడం ద్వారా వందలాది మంది మరణించారన్నారు. ఇజ్రాయెల్ వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, శాంతి చర్చలు కొనసాగించాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామల మాట్లాడుతూ ఇరాన్‌లో ఆడవాళ్లపై జరుగుతున్న మారణకాండకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ కన్వీనర్ మురళి, చార్వాక, రషీద్, కర్రి మల్లేశం, రెండు తెలుగు రాష్ట్రాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెహ్రూ యువకేంద్ర అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా కొండా ప్రసాద్




తాటిచెట్లపాలెం: నెహ్రూ యువ కేంద్ర అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా ఉత్తర నియోజకవర్గానికి చెందిన కొండా ప్రసాద్ నియమితుడయ్యారు. ఈ మేరకు కేంద్ర యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ మాధవ్‌లకు కొండా ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

జీవీఎంసీ దఫేదార్ల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న దఫేదార్లు

ఆరిలోవ: జీవీఎంసీ దఫేదార్ల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ముడసర్లోవ పార్కులో ఘనంగా జరిగింది. సుమారు 150 మంది దఫేదార్లు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అతిథులుగా పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొని దఫేదార్లతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ నారాయణ్, గణపతి, నరేష్, సింహాచలం, అప్పారావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా యల్లపు


యల్లపు రఘురామ్‌ను అభినందిస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా యల్లపు రఘురామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు మురళీధరణ్‌రాజా ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మణిందర్‌సింగ్ పాల్గొని యల్లపు రఘురామ్‌ను నియమించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి అమ్మోరుతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా మణిందర్‌సింగ్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వహించుకునేందుకు లైసెన్స్ జారీ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఇప్పటికే రెండు సార్లు ప్రొఫెషనల్ బాక్సింగ్ బౌట్స్‌లో పాల్గొని ర్యాంకింగ్ సాధించిన బాక్సర్లు కె. శ్రీను, భవానీప్రసాద్, గణేష్‌ను అభినందించారు. యల్లపు రఘురామ్ మాట్లాడుతూ క్లబ్ కోచ్‌లు, బాక్సర్ల సహకారంతో ప్రొఫెషనల్ క్రీడను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, గొర్రెల చందు, డాక్టర్ బి.సునీల్, రూబెన్, యల్లపు పృథ్వీ, పలువురు కోచ్‌లు, బాక్సర్లు పాల్గొన్నారు.

విద్యతోపాటు మానవీయ విలువలు అవసరం


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి విద్యావిహార్ 38వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీలోని పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాజీ ఐఏఎస్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యా విహార్ విద్యార్థుల సేవా దృక్పథం వెలకట్టలేనిదన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక స్పృహ, సేవా నిరతిని అందిస్తున్న శ్రీసత్యసాయి విద్యా సంస్థ కృషి అభినందనీయమన్నారు. నేటి సమాజంలో విద్యతో పాటు మానవీయ విలువలు అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ ప్లాస్ ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య, సత్యసాయి విద్యా విహార్ విద్యార్థిని, గాయని శిరీషాతో పాటు పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'జీవీఎల్ రాజీనామా చేయాలి'

సీతమ్మధార: బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తన సభ్యత్వానికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రకటించాలన్నారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ 1,080 రోజుల నుంచి కార్మికులు పోరాటం చేస్తున్నా కేంద్రానికి చీమ కుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌పై జీవీఎల్ స్పందించకపోతే ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, అన్నం పెట్టే ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయటాన్ని సహించబోమన్నారు. కొయ్య రామకృష్ణ యాదవ్, దార్ల శ్రీను, జగన్ మురారి, శ్రవణ్ పాల్గొన్నారు.